# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 25-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్య విధానాల్ని అనుసరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2.** **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వంద శాతం రైల్వే లైన్ల విద్యుద్దీకరణ జరిగిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.**

**3.** **అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్మాణాల స్థితిగతులపై అధ్యయనానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంకేతిక నిపుణులతో కమిటీని నియమించింది.**

**4.** **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమవుతుంది.**

**5.** **తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా ఈరోజు శాసనసభలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.**

**6.** **తెలంగాణాలోని సింగరేణి గనిని ప్రవేటీకరణ చేయమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.**

**==========================**

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ కి చేసిన కేటాయింపులు రాష్ట్ర పునర్నిర్మాణానికి దోహదపడతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సామాజికమాధ్యమం వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రాజధాని, పోలవరం, పారిశ్రామికవాడల అభివృద్ధి, వెనకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రతిపాదనలను పరిశీలించి కేటాయింపులు చేయడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు హోం మంత్రి అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వేల ప్రాజెక్టులకు 9 వేల 151 కోట్ల రూపాయలు కేటాయించామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు రైల్వే కేటాయింపులపై ఢిల్లీలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం రైల్వే లైన్ల విద్యుద్దీకరణ జరిగిందన్నారు. అమరావతిని అనుసంధానిస్తూ 56 కి.మీ మేర 2 వేల 47 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు రూపొందించామని రైల్వే పనులపై డీపీఆర్‌ను నీతి ఆయోగ్ ఆమోదించిందన్నారు. అలాగే తెలంగాణలోనూ

32 వేల 946 కోట్ల రూపాయలతో రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

-----------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించి అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. నిన్న సాయంత్రం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన నిధుల్లో రాష్ట్రానికి ఏ మేరకు తెచ్చుకోగలమన్నదానిపై ఆయా విభాగాల అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రజలు సాయం కోరి వస్తే దాన్ని మానవీయ కోణంలో ఎలాగైనా పరిష్కరించేలా అధికారుల పనిచేయాలన్నారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి , పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం విధానాల్ని అనుసరిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

-----------------------------

భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై 1999, జూలై 26న విజయం సాధించిన సందర్భానికి గుర్తుగా కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం అందిస్తున్న ప్రత్యేక కథనం...

.. వాయిస్ ....20 సెకన్లు

-----------------------------

తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా ఈ రోజు శాసనసభలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఎల్లుండి బడ్జెట్ పద్దుపై చర్చ జరగనుంది. 29, 30 తేదీల్లో వివిధ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే 31 తేదీన ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ, ఆమోదం జరగనున్నాయి. ఆగస్ట్ 1,2 తేదీలలో ప్రభుత్వ అజెండా, బిల్లులపై చర్చ చేపట్టనున్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఈ రోజు సమావేశమవుతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ మధ్యాహ్నం సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా బడ్జెట్ ఆర్డినెన్స్‌తో పాటు పలు అంశాలపై మంత్రి వర్గం చర్చించనుంది. అలాగే పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణంపై మంత్రివర్గ తీర్మానం కావాలని కేంద్రం కోరడంతో ఈ అంశంపై తీర్మానం చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

మరోవైపు.. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌పై ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 29వ తేదీన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌పై ఆర్డినెన్స్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం 4 నెలలకు ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టింది. ఈ నెలతో అది ముగియనుండటంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో మూడు నెలలకు ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌కు ఆర్డినెన్స్ తీసుకురానుంది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో నిలిచిపోయిన నిర్మాణాల స్థితిగతులపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక నిపుణులతో కమిటీని నియమించింది. ప్రజారోగ్యశాఖ ఇంజినీర్‌ను ఛైర్మన్‌గా ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సభ్యులుగా రాష్ట్ర రోడ్డు భవనాలు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఏపీసీపీడీసీఎల్, ఏపీసీఆర్డీయే, ఏడీసీ సంస్థలకు చెందిన అధికారులను కమిటీలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలో చేపట్టిన వేర్వేరు నిర్మాణాల్ని పరిశీలించాలని సాంకేతిక కమిటీకి ఆదేశాలు జారీ చేసింది. నిలిచిపోయిన నిర్మాణ పనులు ఎక్కడి నుంచి ప్రారంభించాలి, వివిధ నిర్మాణాల పటిష్టత, స్థితిగతుల్ని పరిశీలించి కమిటీ సూచనలు చేయనుంది.

---------------------------

తెలంగాణలోని సింగరేణి గనిని ప్రైవేటీకరణ చేయమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచన కేంద్రానికి లేదని తెలిపారు. దేశంలో ఏ బొగ్గు గనినీ ప్రైవేటికరణ చేయాలన్న ఆలోచన లేదని వివరించారు. ప్రైవేటీకరణ చేయాలంటే 51 శాతం వాటా ఉన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయమే కీలకమని చెప్పారు. ఒడిశాతో చర్చించి సింగరేణికి ఒక గనిని కేటాయించామని తెలిపారు. సింగరేణికి కేంద్రం నుంచి పూర్తి మద్దతు ఉంటుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

---------------------------

తెలంగాణ సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణకి నిధుల కేటాయింపు అంశంపై శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని రాష్ట్రాల సమీకృత సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ బాధ్యతని తెలిపారు.

---------------------------

సామాన్య ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖ న్యాయబంధు ప్రజాసంక్షేమం కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రజలకు విస్తృతంగా న్యాయ సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. న్యాయవాదులు దరఖాస్తుదారులకు ఉచితంగా గానీ, తక్కువ ఫీజు తీసుకొని గానీ న్యాయ సేవలు, సలహాలు అందిస్తారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయబంధు ప్రజాసంక్షేమం కార్యక్రమం గురించి ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

=======================